# రాగసుధ

-అవధానుల సుధాకరరావు

తొలకరి చినుకుల తరుణం వచ్చేసింది. ఆకాశంలో నల్లమబ్బులు కదలడం ప్రారంభించాయి. గాలిలో సెగ తొలగి, చల్లదనంతో గిలిగింతలు పెడుతోంది. సాయంసమయం ఆహ్లాదం గొలుపుతోంది. 'రాగసుధ' ఇంటిముందు, గోడలో ఫిక్స్ చేసిన టైల్‌మీద లిఖించబడ్డ పేరు ప్రదీప్‌కు నచ్చింది. విశాలమైన స్థలంలో, చుట్టూ చెట్లు, చేమలతో చూడ ముచ్చటైన ఇల్లు.

ప్రదీప్ బ్యాంక్ ఉద్యోగి. నాందేడ్ నుంచి బదిలీమీద ఆర్మూర్‌కి వచ్చాడు. అక్కడ రిలీవ్ అవుతుంటే కొందరు భయపెట్టారతన్ని. అమ్మో అక్కడ అద్దెకి ఇళ్లు దొరకడం కష్టం అంటూ ఏమేమో చెప్పారు. ప్రదీప్‌కి బదిలీలు కొత్తకాదు. బాగా కష్టపడి పని చేస్తాడు కాబట్టి, అతనికీ బహుమతి అనుకోవచ్చు. ఎక్కడ, ఏ బ్రాంచీలో సమస్య వచ్చినా తక్షణమే ప్రదీప్‌ను అక్కడికి బట్వాడా చెయ్యాల్సిందే. ఇల్లు, వళ్లు మరచిపోయి, ప్రదీప్ అంతా చక్కబెట్టేలోపు ఇంకో బ్రాంచి వాళ్లు అతనికోసం స్వాగతం పలకడానికి సిద్ధంగా ఉంటారు.

ఇంటిముందు నిలబడి ఉన్న ప్రదీప్‌ని, ప్రభాకరంగారు గమనించి లోపలికి రమ్మని చేత్తో సైగ చేసి పిలిచారు. ప్రదీప్ లోపలికి వస్తూనే ఆ దంపతులకి నమస్కారం చేస్తూ "అచ్చం కైలాసంలో ఉన్న పార్వతీ పరమేశ్వరుల్ని చూస్తున్నట్టుగా ఉంది సార్'' అన్నాడు.

ఆ మాటకి ప్రభాకరంగారితోపాటు, తులసమ్మ కూడా ముచ్చటపడింది.

"ఎవరివోయ్ నువ్వు? ఈ ఊరికి కొత్తనుకుంటా..'' అన్నారాయన మాట కలుపుతూ.

తులసమ్మ కాఫీ తేవడానికి లోపలికి వెళ్లింది.

"నిన్ననే ఇక్కడే స్టేట్ బ్యాంక్‌లో చేరాను సార్!'' అంటూ తన పేరు, వగైరా చెప్పాడు.

"మరి ఇక్కడ తిరుగుతున్నావేంటి?'' సూటిగా అడిగారాయన.

"ఏం లేదు్సార్! అద్దెకి ఇల్లు కావాలి..''

ఈలోపు తులసమ్మగారు ట్రేలో మూడు కాఫీ కప్పులతో వచ్చింది. పొగలు కక్కుతూ, ఘుమ ఘుమలాడుతోంది.

ప్రదీప్ ఒక సిప్ చేసి "పిన్నిగారూ! చక్కటి కాఫీ ఇచ్చారు. థాంక్స్'' అన్నాడు.

ఆవిడ ఆప్యాయంగా నవ్వేసింది.

"ఏమోయ్! అబ్బాయ్‌కి ఇల్లు అద్దెకి కావాలట. నీకు తెలిసిన ఖాళీలు ఉంటే చెప్పరాదూ'' అన్నారు ప్రభాకరంగారు.

"ఖాళీలంటూ ఎక్కడా లేవు. పోనీ...మన మేడమీద పోర్షన్.....'' భర్త ఏమంటాడోనని, అర్థోక్తిలో ఆపింది.

"మనం ఇప్పటివరకూ ఎవరికీ ఇవ్వలేదు కదా...'' అంటూ అభ్యంతరం చెప్పబోతుంటే, ప్రదీప్ ఆశతో బ్రతిమాలుకుంటూ-

"ప్లీజ్ సార్! నా మొహం చూసి ఇవ్వండి. నేను చాలా మంచివాణ్ణి..'' అని తొందరలో, తనకు తానే సర్టిఫికెట్ ఇచ్చేసుకున్నాడు.

"చూడు ప్రదీప్! మాకు అద్దె డబ్బులకంటే, జీవితం ప్రశాంతంగా గడిచిపోవడం ముఖ్యం. మీరిచ్చే నాలుగు రాళ్ళకోసం ఆశపడి, లేనిపోని తలనొప్పులు కొని తెచ్చుకోవడం దేనికని, ఇప్పటిదాకా అసలా ఆలోచనే చెయ్యలేదు''

"పోనీ...ఇప్పుడు చెయ్యడానికి వీలవుతుందేమో చూడండి సార్..''

"నీ మంచితనం చూస్తే చెయ్యకుండా ఉండలేకపోతున్నానయ్యా'' కాస్త మెత్తబడుతూ అన్నారు.

"థాంక్స్ సర్! అయితే..ఇల్లు అద్దెకి ఇవ్వబోతున్నారన్నమాట..''

"ఆగాగు! కొత్తగా పెళ్ళయిన జంటకే ఇస్తే బాగుంటుందని..మరొక ఆలోచన కూడా కలుగుతోంది'' అంటూ మెలిక పెట్టారు ప్రభాకరంగారు.

"సార్! మా పెళ్లయి రెండేళ్లవుతున్నా, మేం కూడా కొత్త జంట కిందే లెక్క..'' అన్నాడు ప్రదీప్ ఆయన మనసు మారకముందే ఒప్పించాలనే ఆరాటంతో.

"అదెలా?'' ఆశ్చర్యంగా చూసారాయన.

"మాకింకా పిల్లాపీచు లేదు కాబట్టి, మేమింకా కొత్త దంపతులకిందే లెక్క''. అని, ఆయన గ్రీన్ సిగ్నల్ కోసం ఆశగా ఎదురుచూశాడు.

"ఓ.కె.'' అనడంతో ప్రదీప్ తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు.

★★★

ప్రదీప్ భార్య పేరు ఊర్మిళ. ఓ మంచిరోజు చూసుకుని ఇంట్లో పాలు పొంగించుకున్నారు. ఆ తరువాత లారీలో సామానుతో దిగారు. వారం రోజులపాటు వాళ్లని బాగా పరిశీలించారు ప్రభాకరం దంపతులు.

ప్రదీప్ పొద్దుటే, తొమ్మిది కాకముందే బ్యాంకుకి వెళ్లిపోతున్నాడు. మధ్యాహ్నం భోజనానిక్కూడా రావడం లేదు. రాత్రి ఎనిమిదో, తొమ్మిదో అవుతుంది అతనొచ్చేసరికి.

ప్రభాకరంగారు అతని తీరుకి పెదవి విరిచారు. నిండా ముప్పై ఏళ్లు లేవు. నిండు యవ్వనదశలో వుండి, అనుభవించాల్సిన తరుణంలో,

ఆస్వాదించాల్సిన దశలో, వీళ్ళు మూర్ఖత్వంతో, చేతులారా జీవన సౌఖ్యాన్ని దూరం చేసుకుంటున్నారు. ఏ వయసుకాముచ్చట! మాధు ర్యాన్ని సొంతం చేసుకునే ప్రయత్నంలో, ప్రతిక్షణం సద్వినియోగం చేసుకో వాల్సిందిపోయి, వీళ్ళు ఎందుకిలా ప్రవర్తిస్తున్నారు? చూస్తుంటే తమకే బాధగా ఉంది. ఏమాత్రం ఉపేక్షించకూడదు. తులసమ్మ కూడా భర్తతో ఏకీ భవించింది.

"ప్రదీప్ మంచితనం చూస్తే ముచ్చటేస్తుందండీ! అబ్బాయి చాలా బుద్ధి మంతుడు" అన్నది.


"అంటే..తప్పంతా ఆ పిల్లదే అంటావా? చిదిమి దీపం పెట్టుకునేలా ఎంత అందంగా ఉందో చూసావా?"

"ఎర్రగా, బుర్రగా అందం ఒక్కటే ఉంటే సరా? భర్తని సుఖపెట్టాలనే ఇంగితం లేకపోయాక, ఎన్ని వుంటే ఏం లాభం?" అన్నది తులసమ్మ.

"ఏంటి..ఆ అమ్మాయిలో నీకు నచ్చని గుణం?"

"ఊర్మిళ..! పేరుకు తగ్గట్లే ఎప్పుడూ నిద్రే! వేళకి స్నానం చేసి, చక్కగా పూజా పునస్కారాలు చేసుకుంటే ఎంత కళగా ఉంటుంది? మొగుడు బ్యాంకుకి వెళ్ళింతర్వాత, అప్పుడు మేడ మీద తిరుగుతూ బ్రష్ చేసుకుం టుంది. మిట్టమధ్యాహ్నం వేళ స్నానానికి వెళ్తుంది. అన్నీ అప్రాచ్యపు అల వాట్లే.." కంపరంగా మొహం పెడుతూ చెప్పింది.

"రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు. మొగుడు ప్రేమని కురిపించినప్పుడే, పెళ్ళాం చిలకలా ఉంటుంది. ఇంట్లో ఒక్కదాన్నే వొదిలేసి, రోజంతా అతను



బ్యాంకు సేవలో తరిస్తూ ఉంటే, ఆ పిల్లకి పాపం...నిద్ర తప్ప వేరే పనేముం టుంది'' అన్నాడు ప్రభాకరంగారు.


"బాగుంది వరస! ఇలా..మనిద్దరం చెరొక పక్షం చేరి, వకాల్తా పుచ్చు కుని వాదించుకుంటూ కూర్చుంటే ఏం లాభం?'' అన్నది తులసమ్మ.

"ఏం చేద్దామో నువ్వే చెప్పు?''

"మీ బుర్రలో ఆలోచనలకి తక్కువా స్వామీ! ఈ పాటికే ఏదో ప్లాన్ తయారై ఉంటుంది'' భార్య మాటలకి, అవునన్నట్లు నవ్వుతూ తల ఊపారు ప్రభాకరంగారు.


***

"ప్రదీప్‌కి కాస్త పిచ్చి ఉంది'' అన్నారు ప్రభాకరంగారు, తను సేకరిం చిన సమాచారాన్ని భార్య చెవినవేస్తూ. తులసమ్మ బెదిరిపోయి చూస్తుంటే మళ్ళీ చెప్పారు.



## మేమిద్దరం మంచి స్నేహితులం

నయనతార-ప్రభుదేవాల గురించిన వార్తలు ఈమధ్య కాలంలో తెగ వస్తున్నాయి. ఇద్దరూ పెళ్లి చేసుకున్నారని కూడా చెప్పేసుకుంటున్నారు. అయితే ఇంత కాలం ఈ విషయమ్మై పెద్దగా స్పందించని నయనతార తాజాగా ఓ కొత్త విషయం చెప్పింది. 'నేను-ప్రభుదేవా మంచి ఫ్రెండ్స్... అంతే. మామధ్య ఎలాంటి 'అనుబంధాలు' లేవు. ఇదంతా కొంతమంది చేస్తున్న ప్రచారం మాత్రమే. నా తల్లిదండ్రులు చెప్పిన విధంగా నడుచుకో వడం నాకు అలవాటు. పెళ్లి విషయంలోనూ అంతే' అంటూ చెప్పుకొ చ్చింది నయనతార.




"పిచ్చి అంటే...యావ అనుకో! ఏ పనిలో పడితే అదే లోకం..అదే వెర్రి! చదువుకునేటప్పుడు చదువే లోకంగా ఉండేవాడు. ఇప్పుడు బ్యాంకులోకి అడుగుపెడితే, ఇల్లూ, పెళ్ళాం ఏవీ గుర్తుండవట పాపం'' అంటూ చెప్పు కొచ్చారు.

తరువాత తులసమ్మ చెప్పుకొచ్చింది. తను ఊర్మిళ రాబట్టిన వివ రాల్ని- "పల్లెటూళ్లో పుట్టి పెరిగిన పిల్ల. చదువు అంతంత మాత్రమే. ఆమె పెరిగిన వాతావరణం ప్రభావంవల్ల- ఇప్పటికీ మొగుడితో అంటీ ముట్టన ట్లుగా ఉంటోంది. స్వేచ్ఛగా చనువుగా సన్నిహితంగా ఏనాడూ ప్రవర్తించ లేదు''

"చాలా విచిత్రంగా ఉందే'' అన్నారు ప్రభాకరంగారు పేపరు మడిచి పక్కన పడేస్తూ.

"ఆడది సహజంగా బిడియంగా ఉన్నప్పుడు మగవాడు చొరవ చెయ్య కపోతే ఆ కాపురం ఎంత చప్పగా ఉంటుందో..ఇదిగో వీళ్ళని చూస్తే తెలు స్తోందండీ...'' అన్నది తులసమ్మ ఒకింత సానుభూతి కురిపిస్తూ.

"మనం చూస్తూ ఊరుకుంటామా? వాళ్ల జీవితంలో నవరసాలు నింపి రాగసుధ అని ఈ ఇంటికి మనం పెట్టుకున్న పేరుని సార్థకం చెయ్యాలి''

"మీరు అంతటి సమర్థులే కదా!''

"పొగడ్తలు కాదు మేడం! ఇవ్వాల్టినుంచి నాకు తమరు బాగా సహకరిం చాలి'' అన్నారు ప్రభాకరంగారు, చూపుల్లో చిలిపితనం ఉట్టిపడుతూంటే.

"అంటే...ఏం చెయ్యాలి?'' కాస్త బెదురుగా అడిగింది తులసమ్మ.

"మనం మరింత అనురాగం ప్రదర్శించాలి. ఆలుమగల బంధం అంటే ఏమిటో వాళ్లకి విడమరిచి, చెప్పకనే చెప్పాలి. జస్ట్ రెండు మూడు సీన్లు చాలు. అతగాడు క్షణం కూడా పెళ్ళాం కొంగు పట్టుకు తిరగాలి. అంతే..'' అన్నారాయన.

తులసమ్మగారు కొత్త పెళ్లికూతురయ్యింది అప్పుడే.

***

ప్రదీప్‌కి ఉదయాన్నే ఐదుగంటలకల్లా లేచి వాకింగ్‌కి బయల్దేరటం అల వాటు.

ఆరోజు... మేడమెట్లు దిగి క్రిందకు రాగానే, ప్రభాకరంగారు కన్పించారు దొడ్లో నీళ్లకాగుకి మంట రాజేస్తూ "ఏంటి సార్...ఇంత పొద్దుటే..? ఏవన్నా విశేషమా?''

"అవునోయ్! ఇవ్వాళ నా ప్రేయసి పుట్టినరోజు...'' అన్నారాయన హుషా రుగా. ప్రదీప్ వింతగా చూస్తుంటే "..అర్థంకాలేదా? భార్యని ప్రియురాలిగా చూసుకుంటే, దాంపత్యం నిత్యనూతనంగా ఉంటుంది'' అంటూ విడమర్చి జీవిత రహస్యం చెప్పారు. ప్రదీప్ వెళ్లబోతుంటే "అన్నట్టు...ఈ రోజంతా మీరు మా అతిథులుగా ఉండాలి. మధ్యాహ్నం, రాత్రి భోజనాలు మా ఇంట్లోనే..'' అన్నారు.

ప్రదీప్ ఏదో చెప్పబోతుంటే, "ఇవ్వాళ ఆదివారం కాబట్టి ఎలాంటి కార ణాలు వినబడవు..'' అన్నారు.

ఆరోజు ఉదయం ఎనిమిది గంటలకు తులసమ్మ చేత 'కేక్' కట్ చేయిం చారు ప్రభాకరంగారు.

ఓ ముక్క తుంచి ఆమె నోట్లో పెట్టి, చటుక్కున బుగ్గమీద ముద్దొకటి పెట్టారు. ఆ దృశ్యం చూసిన ప్రదీప్‌తోపాటు, ఊర్మిళ కూడా ఓ విధమైన అలజడికి గురైంది.

తరువాత ప్రభాకరంగారు వాళ్ళిద్దర్ని ఉద్దేశించి చెప్పారు "మై డియర్ యంగ్ కపుల్! మా దాంపత్యం మూడుపదుల అనుబంధాన్ని పూర్తిచేసు కున్నా ఏ రోజూ రొటీన్‌గా అన్పించకపోవడానికి కారణం- ఈ రతీదేవి

మహిమే..నాకేం కావాలో, నాకేది ఇష్టమో, నా మనసు ఏ మూడ్‌లో ఉందో..వగైరాలన్నీ తనకే బాగా తెలుసు. ఆవిడ ససేమిరా అంటుంది కానీ రోజూ కాసేపు ఆమె పాదాలొత్తి, కాస్తయినా ఋణం తీర్చుకోవాలని ఉంది''

''చాల్లే ఊరుకోండి'' బిడియంతో వారించింది తులసమ్మ. ప్రభాకరంగారికి భార్యంటే ఎంత అపురూపమో! ప్రదీప్‌కి కొంచెం గిల్టీగా అన్పించింది. ఊర్మిళకి కనీసం తను బర్త్‌డే విషెష్ కూడా చెప్పలేదు ఇంతవరకూ.

మధ్యాహ్నం భోజనాలకి ప్రభాకరంగారు సతీసమేతంగా మేడ మీదకు వచ్చి, వారిని ఆహ్వానించి తీసుకువెళ్ళారు. కంచం నిండుగా రకరకాల వంటకాలు, షడ్రోసోపేత విందు భోజనం అంటే ఇదే కాబోలు.

డైనింగ్ టేబుల్ మీద కాకుండా, చక్కగా నేలమీద పీటలు వేసి కూర్చున్నారు. అరటి ఆకుల్లో ఇంపైన భోజనం. సరదా కబుర్లతో గంటసేపు నింపాదిగా తిన్నారు.

ప్రభాకరంగారు మొదటి ముద్ద కలిపి మురిపెంగా తులసమ్మగారికి తినిపించడము, ఆవిడ కూడా సిగ్గులొలుకుతూ ప్రభాకరంగారి నోటికి ముద్ద నందించడం...ప్రదీప్‌తో పాటు ఊర్మిళక్కూడా నచ్చింది. ఇది ఈ వేళ తంతుకాదట. ప్రతీరోజూ వాళ్ల దినచర్యలో భాగమట.

అక్కడ్నించి వచ్చాక, చాలాసేపు తులసమ్మగారే, ఊర్మిళ మనసులో మెదిలింది. కొంతమంది దగ్గర మనం చాలా నేర్చుకోవచ్చు. వాళ్ళు నోరు విప్పి నీతి వాక్యాలు చెప్పరు.

హితబోధలు చెయ్యరు. అయినా...వాళ్ల జీవన విధానం ఎంతో ప్రభావితం చేస్తుంది ఒక్కొక్కర్ని. ఊర్మిళపైన కూడా తులసమ్మగారి నడవడిక అలాంటి పనే చేసింది.

ఆవిడకి మొగుడంటే ఎంత గొప్ప భావన. రుక్మిణీదేవి చూపిన భక్తి, సత్యభామకున్న రక్తి, రామునిపట్ల సీతకున్న అనురక్తి...ఇవన్నీ తులసమ్మగారిలో కనిపించాయి. మరి తనో..? ఆ ప్రశ్న తలెత్తగానే, ఊర్మిళ మనసులో అపరాధ భావన కలిగింది.

ప్రదీప్ ఎంతో మంచివాడు. ఉత్తముడు. తనకి ఎలాంటి కష్టం రాకుండా చూసుకుంటున్నాడు. తను పెరిగిన పరిసరాలు, వాతావరణం వల్ల..అతనితో సరదాగా ఉండలేకపోయింది. పెళ్లయి రెండేళ్ళవుతున్నా, ఇద్దరి మధ్యా ఇంకా ఏదో అడ్డుగోడ అలాగే నిలిచివుంది.

శరీరాల కలయిక అయితే జరిగింది కాని, మానసికంగా సాన్నిహిత్యం ఏర్పడలేదనిపిస్తోంది.

ప్రదీప్‌లాంటి సంస్కారవంతుణ్ని ఇంకా బాధపెడితే, దేవుడు కూడా తనని క్షమించడు.

ఆ రాత్రి భోజనాలు ఆరుబయట వెన్నెల్లో ముగించారు. తరువాత అందరూ తాంబూలాలు నవుల్తూ, పిచ్చాపాటి ముచ్చట్లలో పడ్డారు.

ప్రదీప్ దంపతులు వాళ్ళకి బట్టలు పెట్టి, పాదాభివందనం చేశారు.

''ఏమిటోయ్ ఈ హడావుడి?'' అన్నారు ప్రభాకరంగారు, మొహమాటంగా.

''ఏదో మా అభిమానం...'' అన్నాడు ప్రదీప్.

''చిలకాగోరింకల్లా మీ జంట చూడ ముచ్చటగా ఉంది నాయనా..'' అంటూ మెచ్చుకోలుగా చూసింది తులసమ్మ.

''బాబాయిగారూ! ఈ ఇంటికి 'రాగసుధ' ని పేరు పెట్టారు బావుంది. ఈ ఆలోచన మీదేనా?'' అంటూ సందేహం వెలిబుచ్చాడు ప్రదీప్. ప్రభాకరం గారి ముఖంలో జ్ఞాపకాల వెలుగుపర్చుకుంది.

''ఈ ఇల్లు కట్టి ఐదేళ్లవుతోంది. నా కష్టార్జితం..రిటైర్‌మెంటు డబ్బుల్తో నిర్మించుకున్న పొదరిల్లు ఇది. ఇకపోతే...పేరంటావా..? దంపతుల మధ్య ఉండే ప్రేమానురాగాలకి ప్రతిబింబంగా ఆ పేరుని ఎంపిక చేశాను. కాపురం ఎప్పుడూ పాతబడిపోకూడదు. మొగుడు పెళ్ళాల నడుమ ఆకర్షణ తగ్గకూడదు. తొంభైలో కూడా అనురాగాలు వర్ధిల్లి, 'రాగసుధ' వర్షిస్తుండాలి. అదీ నా ఆలోచన...'' చెప్పారాయన.


ఆరోజు తర్వాత....

ప్రదీప్ సాయంత్రాలు తొందరగా ఇల్లు చేరుకుంటున్నాడు.

అతనొచ్చే వేళకి...ఊర్మిళ కడిగిన ముత్యంలా, చిరునవ్వులతో ఎదురేగుతోంది. ఇద్దరూ సినిమాలు, షికార్లకి చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నారు.

ఎప్పుడూ కిలకిలా నవ్వుతూ, ఎడతెగని కబుర్లు చెప్పుకుంటూ, చెయ్యి చెయ్యి పట్టుకుని నడుస్తుంటే- ప్రభాకరంగారు మెచ్చుకోలుగా చూడగా, తులసమ్మగారు ఆ నయనానందకర దృశ్యాన్ని రెండు కళ్ళూ చాలవన్నట్లు చూస్తుండిపోయేది.

★



## స్పైడీ రాబర్ట్

సినిమా స్పైడర్‌మాన్‌లా నిజ జీవితంలో అలెన్ రాబర్ట్ ఏ రక్షణా లేకుండా ఎత్తయిన బిల్డింగుల్ని ఎక్కేస్తుంటాడు. ఇటీవల సిడ్నీలో 229 మీటర్ల ఎత్తయిన 32 అంతస్తుల భవనాన్ని అవలీలగా ఎక్కి అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేసాడు. ఇప్పటికి ప్రపంచంలో అతను 80 భవనాల్ని ఇలాగే ఎక్కాడట. ఎన్నిసార్లు పోలీసులు అరెస్టు చేసినా అతను ఈ పనిని మానడట.

-తటవర్తి

